సాక్షి
అనకాపల్లి

మంగళవారం । 19 । నవంబర్ । 2024



సమర్థంగా పరిష్కారం

కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 324 అర్జీలు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ సమర్థంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



రైతుల కష్టాలు తీర్చింది జగనన్నే

పూర్తయిన తాచేరు వంతెనను మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు పరిశీలించారు. రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 8లో



కార్గిల్ విజయ దివస్ ర్యాలీ

మహారాణిపేట: కార్గిల్ విజయ దివస్, వీర్ నారీలకు మద్దతుగా సోమవారం విశాఖలో బైక్ ర్యాలీ జరిగింది. మాజీ సైనికులు పాల్గొన్నారు.



శిథిలమయిన అద్దె భవనంలో రేవు పోలవరం బీసీ వసతి గృహం



రోలుగుంట బీసీ బాలుర వసతి గృహంలో తలుపులు లేని గదులు



స్లాబు పెచ్చులు ఊడిపోతున్న గదులు



నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలలో పెచ్చులూడి పడుతున్న డార్మెటరీ



నర్సీపట్నం ఎస్సీ హాస్టల్ దుస్థితి

భద్రత కరువు
సంక్షేమం బరువు

హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కనుమరుగు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

శీతాకాలంలో చలిని తట్టుకునే దుప్పట్లు కరువు.. సగానికి పైగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో రక్షణ గోడలు కానరావు.. తలుపులు లేని బాత్‌రూమ్‌లు.. బాలికల హాస్టళ్లలోనూ ఏర్పాటు కాని సీసీ కెమెరాలు.. జూన్ నెల నుంచి అందని కాస్మొటిక్ చార్జీలు.. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో బితుకుబితుకుమంటూ విద్యార్థులు..

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలలకే సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయి. హైకోర్టు వ్యాఖ్యలతో ప్రభుత్వ పర్యవేక్షణ డొల్లతనమంతా బయటపడింది. వసతి గృహాల్లో గదులకు తలుపులు, కిటికీలకు మెస్‌లు లేకపోవడంతో దోమలు విజృంభించి విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్న పరిస్థితులున్నాయి. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనాల నుంచి విద్యార్థులను తరలించాల్సి ఉన్నా ఆర్థిక భారంతో అధికారులు ముందడుగు వేయడం లేదు. సాక్షి ఫీల్డ్ విజిట్‌లో వెల్లడైన వాస్తవాలివి..

–సాక్షి, అనకాపల్లి/సాక్షి నెట్‌వర్క్

జిల్లాలో బీసీ, ఎస్సీ హాస్టళ్లు	82	
ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు	8,792	
బీసీ హాస్టళ్లు		
	బాలురు	బాలికలు
ప్రీ మెట్రిక్	30	9
పోస్ట్ మెట్రిక్	6	6
ఎస్సీ హాస్టళ్లు		
	బాలురు	బాలికలు
ప్రీ మెట్రిక్	14	9
పోస్ట్ మెట్రిక్	4	4

నర్సీపట్నం నియోజకవర్గంలో పెదబొడ్డేపల్లి బాలుర గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్ అధ్వానంగా ఉంది. డార్మెటరీ శిథిలావస్థకు చేరింది. • నర్సీపట్నం ఎస్సీ బాలుర వసతి గృహంలో భవనం స్లాబ్ పెచ్చులూడుతోంది. • అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంజేపీ బీసీ బాలుర గురుకుల పాఠశాల ఇరుకుగా ఉండడంతో విద్యార్థులు జైలు వాతావరణంలో గడుపుతున్నారు. • 250 మంది విద్యార్థులున్న నర్సీపట్నం అబిద్‌సెంటర్‌లోని ఎస్సీ బాలుర వసతిగృహంలో బాత్ రూమ్‌లు చాలక విద్యార్థులు కాలకృత్యాలకు ఇబ్బందులు పడుతున్నారు. • వేములపూడి ఎస్సీ బాలుర వసతిగృహంలో బాత్ రూమ్‌లు, రన్నింగ్ వాటర్ లేక కాలకృత్యాలు తీర్చుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. • నాతవరం ఎస్సీ బాలికల హాస్టల్లో మరుగుదొడ్లు, గొలుగొండ గురుకుల పాఠశాలలో భోజనం తయారు చేసే కిచెన్ శిథిలావస్థకు చేరాయి. వర్షాలకు కిచెన్ స్లాబ్ పెచ్చులూడి పడుతోంది. పైకప్పు స్లాబ్ పెచ్చులూడి ఇనుప చువ్వలు వేలాడుతున్నాయి. • తాండవ గిరిజన ఆశ్రమం ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన భవన నిర్మాణాలు నత్తనడకన నడుస్తున్నాయి.



మరుగుదొడ్లు, స్నానపుగదుల దుస్థితి

మాడుగుల మండలంలో సరసయ్యపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాత్‌రూమ్‌లు పరిశుభ్రంగా ఉండడం లేదు. ప్లే గ్రౌండ్ వర్షం వచ్చిన పది రోజుల వరకూ బురదమయంగా అధ్వానంగా ఉంటుంది. • కోనాం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో బాత్రూమ్‌ల తలుపులు పాడయ్యాయి. • తురువోలు బీసీ బాలుర వసతి గృహ భవనంలో వర్షం వస్తే భవనం పూర్తిగా తడిసి ముద్దవుతుంది. • చీడికాడ మండలం అప్పలరాజుపురం బీసీ బాలుర హాస్టల్లో రెండు గదులు పాడయ్యాయి. వీటికి మరమ్మతులు చేపట్టి ప్రహరీ గోడ నిర్మించాలి. • దేవరాపల్లి మండలం తెనుగుపూడిలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల వి ద్యాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు గురయింది.

• అనకాపల్లిలో గుండాల జంక్షన్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలో 130 మంది ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థినులు ఉంటున్నారు. అందరూ హాల్లోనే నేల మీద పడుకుంటారు. వర్షం పడితే బిల్డింగ్ అంతా జలమయమే.
• అద్దె భవనంలోనే కొనసాగుతున్న గవరపాలెం మహాత్మజ్యోతిబాపూలే వసతి గృహంలో ఇరుకు గదులు.. నీటి సదుపాయం నిల్
• గాంధీనగరం డీఎస్‌టీ హాస్టల్లో 100 మంది విద్యార్థులకు గదులు సరిపోడంలేదు.



దోర్లు ఊడిపోయిన బాత్‌రూమ్

• అంజికాలనీలో ఉన్న ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో పెద్ద వర్షం పడితే రహదారిపై ఉన్న వర్షపు నీరు గదుల్లోకి వచ్చేస్తుంది. బాత్‌రూమ్‌ల దగ్గర పాముల సంచారం, దోమల బెడద ఎక్కువగా ఉంటుంది.
• విజయరామరాజుపేటలో నేతాజీ సుభాష్ చంద్రబోష్ ఆవాసియా విద్యాలయ అర్బన్ హాస్టల్లో 103 మంది విద్యార్థులున్నారు. బాత్‌రూమ్‌లకు తలుపుల్లేవు. ఫ్యాన్‌లు సరిగ్గా తిరగవు. దోమల బెడద ఎక్కువ. సీసీ కెమెరాలు లేవు. తాగునీటి పైప్‌లు చిదిగిపోయాయి.

చోడవరం మండల పరిధి గోవాడలో బీసీ గర్ల్స్ హాస్టల్‌కు సొంత భవనం లేదు. 80 మంది పిల్లలున్న ఈ భవనంలో వాటర్, బాత్‌రూమ్ సమస్యలున్నాయి. • చోడవరం సమీపంలో గాం. దీగ్రామ పంచాయతీ సిటిజన్ కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహం అన్ని గదుల స్లాబులు పెచ్చులూడి పోయి ఉండడంతో పాటు వర్షాకాలం నీరు కారడం సహజంగా మారింది. విద్యార్థులకు 6 మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యం అంతంత మాత్రం. • పాయకరావుపేట పట్టణంలో గల నెంబర్–1ఎస్సీ బాలుర వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నెంబర్–2 వసతి గృహంలో బాత్‌రూమ్‌లకు డోర్‌లు లేవు. లెట్రిన్‌లు సక్రమంగా లేవు. • ఎస్.రాయవరం మండలంలో బీసి బాలుర హాస్టల్‌కు ప్రహరీ లేదు. గదుల్లో కిటికీలకు గ్రిల్స్ లేవు. కొన్ని గదుల తలుపులకు గడియలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. • అద్దె భవనంలో ఉన్న రేవుపోలవరం బాలబాలికల హాస్టల్లో ప్రహరీ గోడ లేదు. • కోటవురట్ల మండలం ఎస్సీ బాలికల వసతి గృహంలో ప్రహరీ కూలిపోవడంతో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. భవనం స్లాబ్ పెచ్చులూడి పడుతోంది. • యలమంచిలిలో బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో 120 మంది విద్యార్థులున్నారు. వీరికి 9 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో కిటికీలకు అద్దాలు, కొన్ని గదులకు తలుపులు, ఫ్యాన్లు లేవు.



యలమంచిలి బీసీ బాలుర హాస్టల్‌లో ఫ్యాన్లు లేని గది



తెనుగుపూడి గురుకులంలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్

టాయిలెట్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. • కొత్తపేటలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్లో మోటర్ పాడైపోవడంతో 6 నెలలుగా నీటి సరఫరా జరగడంలేదు. ఉన్న ఒక చేతి బోరు కూడా పాడవడంతో పాత టైర్లు పెట్టి నీటిని తోడుకుంటున్నారు. ఇక్కడ స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులు పూర్తిస్థాయిలో లేవు. గాంధీనగరం బాలుర హాస్టల్లో వర్షం కురిస్తే వంటగది పై కప్పు నుంచి నీరు కారుతోంది. • రాంబిల్లి మండలంలోని కేజీబీవీ వసతి గృహంలో విద్యార్థులకు రక్షణ గోడ లేదు.

న్యూస్‌రీల్

నేటి నుంచి బాలోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న జీఎస్ రాజేశ్వరరావు

దాబాగార్డెన్స్: మహారాణిపేటలో గల సెయింట్ ఆంతోనీ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 19 నుంచి 21 వరకు బాలోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతేడాది 6 వేల మంది పిల్లలు 84 ఈవెంట్లలో పాల్గొనగా, ఈ ఏడాది అంతకన్నా ఎక్కువ మంది పిల్లలు పాల్గొంటారని తెలిపారు. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, డీఈవో సారథ్యంలో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యక్షురాలు కె రమా ప్రభ మాట్లాడుతూ 700 స్కూళ్లకు పోటీల బ్రోచర్ పంపామని, విశేష స్పందన కనిపిస్తోందన్నారు. కోశాధికారి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ పోటీలు జరిగే 76 ఈవెంట్లకు జడ్జీలుగా వ్యవహరించేందుకు కళా, సాంస్కృతిక రంగాల్లో నిష్ణాతులైన 96 మంది అంగీకరించారని తెలిపారు. పాల్గొనే పిల్లలందరికీ సర్టిఫికెట్లు, విజేతలకు మెమెంటోలు అందజేయనున్నామని తెలిపారు. సమావేశంలో అధ్యక్షుడు పి.రఘు, కమిటీ సభ్యులు ఎల్లాజీ, సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న గోపినాథ్

నక్కపల్లి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ అన్నారు. సోమవారం ఆయన వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ మండల శాఖ తరఫున లంచ్ బ్యాగ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల సమయాలు మార్చాలన్న ప్రభుత్వ ఆలోచన పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.రమణ, ప్రగడ శివాజీ, గౌరవాధ్యక్షుడు చోడిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ప్రసాద్, రమణ, ఎన్‌వీఎస్ ఆచార్యులు పాల్గొన్నారు.

నిరసన గళం

• 108 సిబ్బంది, ఆశా వర్కర్ల ఆందోళన బాట





ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, పక్కన ఒకరోజు నిరాహార దీక్షలో పాల్గొన్న 108 సిబ్బంది

తుమ్మపాల: తమ డిమాండ్లు నెరవేర్చాలని, సమస్యలు తీర్చాలని 108 సిబ్బంది, ఆశా వర్కర్లు ఆందోళనకు దిగారు. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద సోమవారం నిరసన తెలిపారు. 108 సిబ్బంది ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. ప్రమాదాలు జరిగిన నిమిషాల్లో ప్రజలకు సేవలందించే తమకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమను ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించాలని, 8 గంటల పని సమయాన్ని 3 షిఫ్టులలో పెట్టాలని, ఈఎంటీలను నియమించాలని, మరణించిన ఉద్యోగికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని వినతి అందించారు.

ఆశా వర్కర్ల నిరసన

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఆశాలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, పనిభారం తగ్గించాలని, పాడైన సెల్ ఫోన్ల స్థానంలో కొత్త 5 జి సెల్ ఫోన్లు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు, నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని, ఏఎన్ఎం నియామకాల్లో ఆశాలకు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, ఆశాల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ పార్వతి, కె.శాంతి, రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి, జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి, బి.రామలక్ష్మి, అరుణ, కె.లక్ష్మి, చిట్టెమ్మ, కనకమహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సమీర్‌శర్మ బాధ్యతల స్వీకరణ



పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ నూతన హెడ్(హెచ్‌వోపీ)గా సమీర్ శర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీపీసీలో 1988 ఆగస్టు 24న చేరిన సమీర్‌శర్మ సంస్థలో అనేక కీలకమైన పదవులను నిర్వహించారు. ఇంతకు ముందు ఆయన ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో జనరల్ మేనేజర్‌గా వ్యవహరించారు. కొత్త బాధ్యతల్లో సంస్థ మరిన్ని కొత్త మైలురాళ్లను అధిగమించి, భారతదేశ ఇంధన రంగానికి కీలకంగా మారాలని అభినందిస్తూ పలు విభాగాల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతించారు.

రౌడీయిజం వారి వృత్తి.. రాజకీయం ప్రవృత్తి.. తెలుగుదేశం క్రియాశీలక సభ్యులు వారు.. ఆ పార్టీ అండతో చెలరేగిపోతారు.. వారు ఉన్నారంటే ఆ ప్రాంతంలో ఎవరూ సంచరించడానికి వీల్లేదు.. ఎవరైనా ఎదురుగా కనిపిస్తే చాలు తమను ధిక్కరించినట్టు భావిస్తారు.. వారి పనిపడతారు. నర్సీపట్నంలో సర్వసిద్ధి నాగేశ్వరరావు అనే యువకుడి హత్య అలాగే జరిగింది. టీడీపీ నాయకుడు బండారు కొండబాబు, పార్టీ సాధారణ కార్యకర్త అయిన రౌడీ షీటర్ బండారు సంతోష్ అకారణంగా అతనిని పొట్టన పెట్టుకున్నారు. మృతుడి భార్య, ఇద్దరు పసిపిల్లలు అనాథలయ్యారు.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి మెయిన్ రోడ్డుపై బైఠాయించిన మృతుడి బంధువులు, గ్రామస్తులు

• నర్సీపట్నంలో యువకుడి దారుణ హత్య
• నిందితులిద్దరూ టీడీపీకి చెందినవారు
• అయ్యన్న ఇలాకాలో రెచ్చిపోతున్న రౌడీషీటర్లు
• మృతుడి బంధువులు, గ్రామస్తుల ఆగ్రహం
• పోలీస్ స్టేషన్, ఏరియా ఆస్పత్రి ముట్టడి

రౌడీ రాజ్యం

నర్సీపట్నం: హతుడికి, నిందితులకు పాత కక్షలు లేవు. హత్యకు గురైన నాగేశ్వరరావు అనుచితంగా ప్రవర్తించిందీ లేదు. కానీ క్షణాల్లో ప్రాణాలు తీశారు. టీడీపీ అండతో కలిగిన కండకావరమే అందుకు కారణం. అందుకే మృతుడి బంధువులు, గ్రామస్తుల్లో అంత ఆగ్రహం రగిలింది. హత్యను నిరసిస్తూ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడి ఇంటికి వెళ్లేందుకు వారు బయలుదేరగా మార్గం మధ్యలో పోలీసులు అడ్డుకుని నిలువరించారు. వెనుతిరిగిన మృతుడి బంధువులు టౌన్ పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. హంతకులను అరెస్ట్ చేసి.. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మృతుడి బంధువులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్టేషన్ ముందు బైఠాయించి నిరసన తెలియజేశారు. హత్యకు పాల్పడిన రౌడీ షీటర్ సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న బండారు కొండబాబును సాయంత్రంలోగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేస్తామని టౌన్ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

అకారణంగా ప్రాణం తీశారు..

టౌన్ సీఐ గోవిందరావు అందించిన వివరాల ప్రకారం.. కోటవురట్ల మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన సర్వసిద్ధి నాగేశ్వరరావు(నాగు) (32) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. నర్సీపట్నం కొత్తవీధిలో నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి తన స్నేహితులు ఎస్.సురేష్, పి.నవీన్, శంకర్‌లను భోజనానికి ఇంటికి తీసుకువచ్చాడు. ఆ దారి వెంబడి రావొద్దంటూ అక్కడ మద్యం సేవిస్తున్న టీడీపీ నాయకుడు కొండబాబు, ఆ పార్టీ సాధారణ కార్యకర్త అయిన రౌడీషీటర్ సంతోష్ వారిని హెచ్చరించారు. భోజనం చేసి తిరిగి వెళ్తున్న మృతుడి స్నేహితుడు శంకర్‌ను మళ్లీ ఎందుకురా ఇలా వచ్చావంటూ బైక్ తాళాలు లాక్కొని సిగరెట్‌తో మెడపై కాల్చారు. శంకర్ వెళ్లి నాగేశ్వరరావును తీసుకురావడంతో ఇరువు వర్గాల మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న రౌడీ షీటర్ సంతోష్, టీడీపీ నాయకుడు కొండబాబులు నాగేశ్వరరావుపై దాడి చేశారు. స్పృహ కోల్పోయిన నాగేశ్వరరావును బంధువులు సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఐదు నెలల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

నాగేశ్వరరావు హత్య విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున సోమవారం ఉదయం టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. నిందితులు ఇద్దరూ టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ అండతో ఎంత మందిని హతమారుస్తారంటూ బంధువులు, గ్రామస్తులు ఆక్రోశం వెలిబుచ్చారు. హత్యను నిరసిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఇంటికి వెళ్లేందుకు మూకుమ్మడిగా బయలుదేరారు. పోలీసులు నచ్చచెప్పడంతో వెనుతిరిగి టౌన్ పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. హత్యకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుంటామని టౌన్ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ నచ్చజెప్పినా వారు శాంతించలేదు. మృతుడి సామాజిక వర్గానికి చెందిన నాయకుడు బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రి ముందు కూడా ఆందోళనకు దిగారు. మెయిన్ రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనరాకపోకలు నిలిచిపోయాయి. హంతకులను అరెస్టు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తేనే మృతదేహాన్ని తీసుకువెళ్తామని లేదంటే, తీసుకువెళ్లే ప్రసక్తి లేదని భీష్మించారు. మృతుడి భార్య లక్ష్మి ఇద్దరు పిల్లలతో కన్నీరు మున్నీరుగా విలపించడం ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. మృతుడు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను స్పీకర్ సతీమణి చింతకాయల పద్మావతి సోమవారం రాత్రి పరామర్శించారు.



నాగేశ్వరరావు మృతదేహం



ఇద్దరు పిల్లలతో మృతుడి భార్య లక్ష్మి

ఇద్దరు నిందితుల అరెస్ట్

నర్సీపట్నం: సర్వసిద్ధి నాగేశ్వరరావును హత్య చేసిన నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ మోహన్ తెలిపారు. మద్యం మత్తు, ప్రేరేపిత మాటలే హత్యకు దారి తీశాయన్నారు. మృతుడి మేనమామ పల్లా అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు కట్టామన్నారు. సీఐ గోవిందరావు బృందం నేరం జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్నారన్నారు. హత్యకు పాల్పడిన కొత్తవీధికి చెందిన రౌడీ షీటర్ బండారు సంతోష్‌ను సుబ్బారాయుడుపాలెం రాయల్ రిసార్ట్స్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. బండారు కొండబాబును మాకవరపాలెం వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెంచామన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే కేసులు పెడతామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కేడీ పేట, డౌనూరు ప్రాంతాల్లో రెండు పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. రౌడీ షీటర్లు ఎలాంటి అకతాయి చర్యలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మోహన్

క్లుప్తంగా

సీపీఎస్‌కు వ్యతిరేకంగా 10న భారీ బహిరంగ సభ



సీపీఎస్‌పై ఉద్యోగుల బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోరుకొండ సతీష్

అనకాపల్లి : సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా జీపీఎస్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో భారీ బహిరంగ సభ గోడపత్రికలను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన టీడీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత ఆ విషయమై మాట్లాడడం లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రొంగల అప్పలనాయుడు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి బోయిన చిన్నారావు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మరింత సహకారం

- అసిస్టెంట్ రిజిస్ట్రార్ గీతావాణి



కె.కోటపాడులో సహకార పతకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ గీతావాణి

కె.కోటపాడు : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా సభ్య రైతుల సంక్షేమానికి కృషి చేయనున్నట్టు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.గీతావాణి అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా కె.కోటపాడు పీఏసీఎస్ ఆవరణలో సోమవారం సహకార పతాకావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటుతో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ జరుగుతుందని, తద్వారా రైతులకు మరింత వేగవంతంగా సొసైటీ సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ ఎడ్యుకేషన్ అధికారి సోమేశ్వరరావు, కె.కోటపాడు, చౌడువాడ, ములకలాపల్లి సొసైటీల సీఈవోలు ఆర్.చిన ఈశ్వరరావు, బి.సత్యనారాయణమూర్తి, ఎం.వెంకటరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు తీర్చింది జగనన్నే

- తాచేరు వంతెన, రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.7.4 కోట్ల మంజూరు
- పనులు పూర్తికావడంతో పరిశీలించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులకు అభినందనలు



తాచేరు వంతెన పరిశీలిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల : రైతుల కష్టాలు తీర్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.7.4 కోట్లు మంజూరు చేయడంతో తాచేరు వంతెన, రోడ్డు నిర్మాణం పూర్తయ్యిందని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని అనేక గ్రామాల ప్రజలు, రైతులు మాడుగుల చేరుకునేందుకు ఈ వంతెన ఎంతో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సురవరం వచ్చి వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు రోడ్డు, వంతెన నిర్మాణానికి తాను శంకుస్థాపన చేశానని గుర్తు చేశారు. ఒప్పందం పూర్తికాక ముందే డి.గొటివాడ నుంచి మాడుగుల దేవీ ఆలయం వరకు రోడ్డుతోపాటు తాచేరుపై వంతెనను కాంట్రాక్టర్ వెంకట సుబ్బయ్య నాణ్యతతో నిర్మించారని అభినందించారు. పనులు పూర్తి కావడంతో ఈ ప్రాంత రైతుల తోపాటు తాచేరు ఇవతల గ్రామాల ప్రజలు, రైతుల కష్టాలు తీరాయన్నారు. వంతెన నిర్మించాలని గత పాలకులను రైతులు చాలా సార్లు కోరినప్పటికీ అప్పట్లో పూర్తి చేయలేదన్నారు. ఈ సమస్య తన దృష్టికి రావడంతో రైతుల కష్టాలు స్వయంగా చూసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించానన్నారు. ఎన్నికలకు ముందే దాదాపు రోడ్డు నిర్మాణం పూర్తయిందని, ప్రస్తుతం వంతెన పనులు పూర్తయ్యాయన్నారు. అలాగే ఘాట్‌రోడ్ నుంచి కింతలి వరకు 9.6 కిలోమీటర్ల రోడ్డుకు రూ.9 కోట్లు మాజీ సీఎం జగన్ పాలనలో మంజూరు చేయడంతో ఆ పనులు ఎన్నికలకు ముందే పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో సీసీ రోడ్లు నాణ్యతతో నిర్మిస్తున్నారన్నారు. చాలా ఏళ్లుగా మాడుగులలో అతిథి గృహం లేకపోవడంతో సర్వాంగ సుందరంగా తన హయాంలోనే నిర్మించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ అధికారులకు సౌకర్యంగా ఉందన్నారు. ఘాట్‌రోట్ నుంచి మాడుగుల వచ్చే మార్గంలో తాచేరుపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెన శిథిలమైందని, కొత్తగా మేము నిర్మించిన వంతెన మండల వాసులకు ఆధారంగా మారుతుందన్నారు. వంతెన నిర్మాణం పూర్తికావడంతో పాడేరు నుంచి మాడుగులకు ఆర్టీసీ బస్సులు నడపడానికి స్థానిక ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు.

అనంతరం నాణ్యతతో పనులు వేగవంతంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్‌ను, ఇంజినీరింగ్ అధికారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముదు రమణమ్మ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, కో ఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీసా, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లవిల్లి సంజీవరావు, దేవరాపల్లి శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు, కోరుకొండ చెల్లంనాయుడు, సయ్యపురెడ్డి నారాయణరావు, బొద్దపు భాస్కరరావు, అల్లంగి సంజీవరావు, ఎసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భూముల సర్వే మతలబు ఏమిటో..!

- రైతుల్లో ఆందోళన
- పెదతీనార్ల, దొండవాకలలో జిరాయితీ, ప్రభుత్వ భూములపై ఆరా
- ఏపీఐఐసీ అదనపు భూసేకరణ కోసమేనని ప్రచారం
- స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుపై ఊహాగానాలు
- గోప్యంగా ఉంచుతున్న రెవెన్యూ అధికారులు



పెదతీనార్లలో సర్వే చేస్తున్న రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు

నక్కపల్లి: తీరప్రాంత గ్రామాల్లో భూముల సర్వే కొనసాగుతోంది. గత రెండు రోజుల నుంచి ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట, నక్కపల్లి మండలం పెదతీనార్ల, దొండవాక గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూములు సర్వే చేస్తున్నారు. ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు చేస్తున్న భూముల సర్వే రైతులను కలవరపెడుతోంది. ఎంపిక చేసిన భూముల్లోనే ఈ సర్వే చేయడంతో తమ భూములు కంపెనీల కోసం సేకరిస్తారేమోనన్న భయాందోళనలు రైతుల్లో నెలకొన్నాయి. ఇప్పటికే నక్కపల్లి మండలంలో విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కోసం ఏపీఐఐసీ వారు 5వేల ఎకరాలు భూసేకరణ చేశారు. వీటిలో బల్క్ డ్రగ్‌పార్క్ కోసం 2వేల ఎకరాలు, మౌలిక సదుపాయాల కోసం మరో వెయ్యి ఎకరాలు కేటాయించారు. ఇంకా రెండు వేల ఎకరాలు ఏపీఐఐసీ వద్ద అందుబాటులో ఉంది. తాజాగా అర్సిలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్ వారు నక్కపల్లి మండలంలో రాజయ్యపేట సమీపంలో పోర్టు ఆధారిత ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేస్తామని కంపెనీకి 2600 ఎకరాలు కావాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. దీనిపై ఏపీఐఐసీ వారు జిల్లా యంత్రాంగానికి భూములు గుర్తించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ ద్వారా మరిన్ని భూములు సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. దీనిలో బాగంగానే గడచిన రెండు రోజుల నుంచి ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో తీరప్రాంతాన్ని అనుకుని రాజయ్యపేటకు అతి సమీపంలో ఉన్న గ్రామాల్లో జిరాయితీ, ప్రభుత్వ భూములు గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలుస్తోంది. నక్కపల్లి తహసీల్దార్ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఏపీఐఐసీ, రెవెన్యూ సర్వే బృందాలు సోమవారం పెదతీనార్ల, దొండవాక గ్రామాల్లో సర్వే నిర్వహించారు. పెదతీనార్లలో సర్వే నంబర్లు 1నుంచి 11,15, 17,18, 19, 29, 30, 31, 32, 33, 34, 38, 75, 80, 83, 84, 85, 87, 90, 91, 100, 103, 108, 117, 118, 120, 121, 122, 123, 124, 125, 133, 134, 135, 137, 138, 139, 144, 186, 206, 207, 208, 210, 211 తదితర సర్వే నంబర్లలో సుమారు 1027 ఎకరాల భూములను గుర్తిస్తున్నట్టు తెలిసింది. పెదతీనార్ల రెవెన్యూ పరిధిలో మొత్తం 69 సర్వే నంబర్లలో ఉన్న భూములను సర్వే చేయనున్నట్టు సమాచారం. ఏపీఐఐసీ ద్వారా మరిన్ని భూములు సేకరించేందుకే ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఏపీఐఐసీ ద్వారా భూసేకరణకు ఈ భూములు సరిపోతాయని (అనుకూలంగా ఉన్నాయని) పంచాయతీ వారికి తెలిపిన సమాచారంలో పేర్కొన్నారు. అధికారులు మాత్రం ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నామని తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. ఏపీఐఐసీ వారికి భవిష్యత్ అవసరాల కోసం ఈ భూములు పనికొస్తాయని నివేదిక సమర్పించేందుకే ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. "దొండవాక సమీపంలో ఉన్న పెద్ద కొండ, చిన్నకొండలను కూడా సర్వే చేయనున్నట్లు సమాచారం.

కలెక్టరేట్ సిబ్బందికి వైద్య పరీక్షలు



కలెక్టరేట్ సిబ్బందిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

తుమ్మపాల : ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ఎన్‌సీడీ -3.0 సమగ్ర కేన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎం.ఎస్.వి.కె. బాలాజీ అన్నారు. కలెక్టరేట్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టరేట్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించామన్నారు. సాధారణ ఎన్‌సీడీల నివారణ, నియంత్రణ, స్క్రీనింగ్, జనాభా ఆధారిత స్క్రీనింగ్ ప్రోగ్రామ్ అంటే మధుమేహం, అధిక రక్తపోటు సాధారణ కేన్సర్లు (ఓరల్, బ్రెస్ట్ సర్వైకల్ క్యాన్సర్లు) స్క్రీనింగ్ సర్వే చేశామని తెలిపారు. మొత్తం 148 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 30 మందిలో రక్తపోటు, 28 మందిలో మధుమేహం గుర్తించి చికిత్సలు సూచించామన్నారు. 28 మంది మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగ్ నిర్వహించామన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జె.ప్రశాంతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 13,55,051 మందికి 5,72,457 గృహ సందర్శనలు చేసి సర్వే ద్వారా తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఇంతవరకు 19,501 మందికి తనిఖీలు నిర్వహించామన్నారు. 18 ఏళ్లు దాటిన అందరికీ పరీక్షలు నిర్వహిస్తామని, 30 ఏళ్ల వయస్సు గల పురుషులు, మహిళలకు నోటి క్యాన్సర్, 30 ఏళ్ల వయస్సు దాటిన మహిళలకు రొమ్ము-గర్భాశయ క్యాన్సర్ల స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. అసాధారణ కేసులను వైద్య అధికారులు పరీక్షించి అనుమానితులను ఫాస్ట్‌ట్రాక్ చానల్ ద్వారా వైద్య సదుపాయం అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారులు డాక్టర్ ఈశ్వర్ రాణి, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ ధనంజయ్, డాక్టర్ పావని, డాక్టర్ జయదీప్, ఎన్‌సీడీ సిబ్బంది మోహన్, రేవతి, శ్యామల, చైతన్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీవీఎంసీకి రూ.10 కోట్ల ఆస్తిపన్ను చెల్లించిన పోర్టు



కమిషనర్ సంపత్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న పోర్టు ఫైనాన్స్ మేనేజర్ రమణమూర్తి

డాబాగార్డెన్స్ : విశాఖ పోర్టు అథారిటీ 2024-25 ఏడాదికి గాను రూ.10 కోట్ల ఆస్తి పన్నును చెక్కు రూపంలో చెల్లించినట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. పోర్టు ఫైనాన్స్ మేనేజర్ రమణమూర్తి నుంచి జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్.శ్రీనివాస్, జోనల్ కమిషనర్ రాము ఈ చెక్కు అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి ఆస్తి పన్ను, బకాయిల వసూళ్లపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని వారిని ఆదేశించారు.

ప్రజా సమస్యలకు సమర్థంగా పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



కూలిరేట్లు పెంచాలంటూ నిరసన తెలుపుతున్న హమాలీలు

- మండల, వార్డు స్థాయిల్లో పీజీఆర్ఎస్ అమలు
- కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం

తుమ్మపాల: మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, కె.కె.ఆర్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్. సుబ్బులక్ష్మి, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కావలసిన సమస్యల గూర్చి కూడా ప్రజలు జిల్లా కార్యాలయానికి వస్తున్నారని, అందువల్ల వారికి డబ్బు, సమయం వృథా అవుతున్నాయన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రజలకు తెలియపరచాలన్నారు. ప్రతి అర్జీపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తీసుకున్న చర్యలను జిల్లా స్థాయిలో సమీక్షించడం జరుగుతుందని అన్నారు. మండల, మున్సిపాలిటీ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను అర్జీదారులు జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో సమర్పించాలన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, వచ్చిన ప్రతి అర్జీని అవగాహన చేసుకోవడం, అర్జీదారు వద్దకు వెళ్లి సమస్య గూర్చి మాట్లాడి, సమస్య సంబంధిత శాఖ పరిధిలోనిది కాకపోతే తెలియపరచడంతో పాటు అందుకు గల కారణాలను వివరించడం, తదుపరి కార్యాచరణపై అర్జీదారునికి అవగాహన కల్పించడం వంటి పంచ సూత్రాలను అధికారులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 324 అర్జీలు నమోదయ్యాయి.

సెలవు పెడితే ఆయాగా తొలగించేశారు

ప్రమాదంలో తన భర్త కాలికి గాయమవడంతో పది రోజులు సెలవు పెట్టినందుకు తనను ఆయా పోస్టు నుంచి తొలగించి మరొకరిని చేర్చుకున్నారని కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందిన కాళ్ల భవానీ అనే మహిళ అధికారుల దృష్టికి తీసుకొచ్చింది. ఈమేరకు గాయాలతో ఉన్న భర్తతో పాటు తన ముగ్గురు పిల్లలతో ఆమె కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు అర్జీ సమర్పించింది. పాఠశాల హెచ్‌ఎంకు సెలవు చీటీ ఇచ్చి సెలవుపై వెళ్తే రాజీనామా చేశానంటూ తనను తొలగించి తనకు జీవనాధారం లేకుండా చేశారని, తనను ఆయాగా మళ్లీ చేర్చుకోవాలని విజ్ఞప్తి చేసింది.



భర్త, పిల్లలతో కాళ్ల భవానీ

పింఛను మంజూరు చేయరూ..

ఒంటరిగా వృద్ధాప్యంలో ఉన్న తనకు పింఛను మంజూరు చేయడం లేదంటూ రోలుగుంట మండలం రత్నంపేట గ్రామానికి చెందిన కింతాడ భూలోకమ్మ అనేక వ్యయప్రయాసలతో కలెక్టరేట్‌కు చేరుకుని పీజీఆర్ఎస్‌లో అర్జీ చేసుకుంది. తనతో పాటు తన అక్క పేరు ఒకే రేషన్ కార్డులో ఉందని చెబుతూ గతంలో తనకు పింఛను తొలగించారని, తరువాత తన పేరున మరో రేషన్ కార్డు చేయించుకుని పింఛను కోసం పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా మంజూరు కాలేదని తెలిపింది. తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరింది.



కింతాడ భూలోకమ్మ



నాబారు కృష్ణ

జలాశయం ఆక్రమణలపై ఫిర్యాదు

రావికమతం మండలం గుడ్డప పంచాయతీ గొర్లాం గ్రామంలో గత 25 ఎకరాల మినీ జలాశయం ఆక్రమణకు గురైందని, తక్షణమే సర్వే చేపట్టి ఆక్రమణదారులను తొలగించి జలాశయాన్ని పూర్వ స్థితికి తీసుకురావాలని కోరుతూ గ్రామానికి చెందిన నాబారు కృష్ణ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. వందల ఎకరాలకు సాగు నీరందించే గొర్లాం చెరువు ఆక్రమణలతో కుచించుకుపోతుందని తెలిపారు. జలాశయం పరిరక్షించాల్సిన ప్రభుత్వ శాఖలు ఆక్రమణదారులను ఓటర్లుగా చేర్చి మరీ చేపడుతున్న సాగునీటి సంఘాల ఎన్నికలను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

హమాలీల కూలీరేట్లు పెంచాలి...

జిల్లాలో సివిల్ సప్లయి గోదాంలలో పనిచేస్తున్న హమాలీల కూలీల రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ, హమాలీల యూనియన్ ఆధ్వర్యంలో హమాలీలు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సరకు ఎగుమతి, దిగుమతి రేట్లు పెంచాలని, 2024 జనవరి నుంచి ఎరియర్స్ చెల్లించాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ పీఎఫ్ క్లెయిమ్‌లు చెల్లించాలని, మరణించిన హమాలీల కుటుంబాలకు పింఛను మంజూరు చేయాలని, 4వ తరగతి ఉద్యోగులుగా హమాలీలను గుర్తించాలని డిమాండ్ చేశారు.

ఎస్పీ కార్యాలయానికి 40 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 40 అర్జీలు వచ్చాయని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయన్నారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఎస్ఐ వెంకన్న పాల్గొన్నారు.

1800 లీటర్ల సారా పులుపు ధ్వంసం



నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

చోడవరం రూరల్ : నాటుసారా అక్రమ తయారీ, రవాణా, అమ్మకాల పట్ల ఉక్కుపాదం మోపే చర్యల్లో భాగంగా సోమవారం 1800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను, నాటుసారా తయారీ బట్టీలను ధ్వంసం చేసినట్టు చోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె..వి.పాపునాయుడు తెలిపారు. బుచ్చియ్యపేట మండలం గంటి కొర్లాం గ్రామం కేంద్రంగా నాటుసారా తయారు చేసి రావికమతం, మాడుగుల, బుచ్చియ్యపేట, చోడవరం మండలాల్లోని పలు గ్రామాలకు సరఫరా అవుతున్నట్టు తమ నిఘాలో తేలిందన్నారు. దీంతో గంటికొర్లాం గ్రామ శివారు ప్రాంతాల్లో ఎస్ఐ ఎం.శేఖరం, హెడ్ కానిస్టేబుల్ ఎం.అప్పారావు సిబ్బందితో కొండ ప్రాంతాల్లో విస్తృత గాలింపు చేపట్టి 1800 లీటర్ల ఊట, సారాబట్టీని కనుగొని వాటిని ధ్వంసం చేసినట్టు సీఐ తెలిపారు. కాగా తమ దాడులను పసిగట్టి నిర్వాహకులు పరారయ్యారని తెలిపారు.

ఫిజియో థెరపీతో మానసిక ఒత్తిడి దూరం

- నిజాం ఫిజియోథెరపీ ఇనిస్టిట్యూట్ వైద్యుడు డా.రమేష్
- కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ



ఫిజియోథెరపిపై శిక్షణ ఇస్తున్న నిజాం ఫిజియోథెరపీ ఇనిస్టిట్యూట్ వైద్యుడు డా. రమేష్

దేవరాపల్లి : విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేందుకు ఉద్యోగులంతా ఫిజియోథెరపి సాధన చేయాలని నిజాం ఫిజియోథెరపీ ఇనిస్ట్యూట్ వైద్యులు డా.రమేష్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఫిజియోథెరపిపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫిజియోథెరపీతో ఒత్తిడిని అధిగమించి, తద్వారా అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందవచ్చునని వివరించారు. ఫిజియోథెరపి విధానాన్ని చేసి చూపించడంతో పాటు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మిగులు భూమిని స్వాధీనం చేసుకోవాలి



వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్‌లు రామునాయుడు, కిషోర్

మాకవరపాలెం : ఆన్‌రాక్ రిఫైనరీకి కేటాయించగా మిగిలిఉన్న భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని శెట్టిపాలెం, భీమబోయిన పాలెం సర్పంచ్‌లు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఆన్‌రాక్ రిఫైనరీ నిర్మాణం కోసం 2008లో రాచపల్లి, జి.కోడూరు, తామరం, భీమబోయినపాలెం రెవెన్యూ పరిధిలోని సుమారు 2400 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించిందన్నారు. ఇందులో ఆన్‌రాక్‌కు ఇవ్వగా మిగిలిన భూమి కూడా ఆన్‌రాక్ స్వాధీనంలోనే ఉందన్నారు. దీనిపై అధికారులు విచారణ చేసి, రిఫైనరీకి కేటాయించగా మిగిలి ఉన్న భూమిని ఆన్‌రాక్ యాజమాన్యం నుంచి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

వాల్తేరు డీఆర్‌ఎంపై ఎఫ్‌ఐఆర్ నమోదు

సాక్షి, విశాఖపట్నం: కాంట్రాక్టర్ల నుంచి రూ.25 లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడిన వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్‌పై సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో పనులు నిర్వహించే కాంట్రాక్టు సంస్థ యజమానుల నుంచి రెండు రోజుల క్రితం పూణేలో లంచం తీసుకుంటూ సీబీఐకి డీఆర్‌ఎం చిక్కిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి సమగ్ర వివరాలతో దర్యాప్తు బృందం నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో డీఆర్‌ఎం పేరుని ఏ1గా చేర్చింది. ముంబైకి చెందిన డీఎస్ మార్కెటింగ్ సంస్థ ప్రొప్రైటర్ సనిల్ రాథోడ్‌ని ఏ2గా, పూణేకి చెందిన హెచ్‌ఆర్‌కే సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఆనంద్ భగత్‌ని ఏ3గా, హెచ్‌ఆర్‌కే సొల్యూషన్స్, గుజరాత్‌కు చెందిన హిందూస్థాన్ ఫైబర్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్ని ఏ4, ఏ5లుగా చేర్చింది. సౌరభ్‌కుమార్‌తో పాటు మిగిలిన వ్యక్తులు, సంస్థలపై సెక్షన్ 61(2) ఆఫ్ బీఎన్ఎస్ 2023, పీసీ యాక్ట్ 1988లోని సెక్షన్ 7, 8, 9, 10, 12 నమోదు చేసినట్లు సీబీఐ ఢిల్లీ ఏసీ-1 కార్యాలయ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుమన్‌కుమార్ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణ బాధ్యతల్ని సీబీఐ ఏసీ-1 సీఐ భన్వేంద్ర చౌదరి కొనసాగిస్తారని ఎస్పీ స్పష్టం చేశారు.

జీసీసీ చైర్మన్‌గా కిడారి శ్రావణ్ బాధ్యతలు

విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చైర్మన్‌గా కిడారి శ్రావణ్‌కుమార్ సోమవారం జీసీసీ ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన ఉత్పత్తుల రవాణాను సులభతరం చేసేందుకు రెండు కొత్త లారీలను ప్రారంభించారు.

క్లుప్తంగా

అధ్వానంగా శారదానది ఘాట్



శారదానది ఘాట్‌లో పేరుకుపోయిన చెత్త

అనకాపల్లి: స్థానిక ఉమారామలింగేశ్వర ఆలయ సమీపంలోని శారదానది ఒడ్డు చెత్తా చెదారంతో అధ్వానంగా తయారైంది. దీంతో కార్తీక మాసంలో నదీ స్నానాలు ఆచరించే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ రోజుల్లో ఈ ఘాట్ ఎలా ఉన్నా కనీసం కార్తీక మాసంలోనైనా పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికే మూడు కార్తీక సోమవారాలు పూర్తయ్యాయని, నాలుగో సోమవారానికైనా ఈ ఘాట్‌ను శుభ్రం చేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముత్తైదువులకు వాయనాల అందజేత



వాయనాలు అందిస్తున్న మళ్ల జగ్గాప్పారావు, మోహిని దంపతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వినాయక గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో పీలావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ముత్తైదువులకు వాయనాలు అందజేశారు. వ్యాపారవేత్త మళ్ల జగ్గాప్పారావు, మోహిని దంపతుల సహాయంతో ఈ వాయనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది కార్తీకమాసంలో మహిళలకు వాయనాలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహానూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మ నాయుడు, కోశాధికారి బి.లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 4,327 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,980	4,350
మొదటి రకం	3,440	4,250
రెండో రకం	3,360	3,770
మూడోరకం	3,100	3,350

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మట్కా	: షిర్డిసాయి
గ్లాడియేటర్	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 26 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4, బీ పాజిటివ్-9, ఓ పాజిటివ్-12, ఏబీ పాజిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 368 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 293 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

వచ్చేశాయి.. శీతాకాలం నేస్తాలు



అనకాపల్లి పట్టణంలో ఉన్ని దుస్తుల దుకాణం

- ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ
- ప్రధాన జంక్షన్లలో జోరుగా విక్రయాలు

తుమ్మపాల: శీతాకాలంలో వెచ్చదనాన్నిచ్చే నేస్తాలు వచ్చేశాయి. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతతో అనకాపల్లిలో ఉన్ని దుస్తుల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. స్వెటర్లు, జర్కిన్లు, శాలువాలు, టోపీలపై ప్రజలు ఆసక్తి చూపిస్తుండడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. నేపాల్, రాజస్థాన్, ఢిల్లీ, చెన్నై, తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు నగరంలో ఏర్పాటు చేసిన ఉన్ని దుకాణాల వద్ద సందడి చేస్తున్నారు. పట్టణంలో పలు జంక్షన్‌లతో పాటు జాతీయ రహదారి ఆనుకుని పదికి పైగా ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి. మండలంలో తుమ్మపాల మెయిన్ రోడ్డులో స్వెట్టర్లను విక్రయిస్తున్నారు.

సరికొత్త డిజైన్లతో.. వినియోగదారులకు ఆకట్టుకునేలా నాణ్యతతోపాటు సరికొత్త డిజైన్లతో ఉన్ని దుస్తులు లభ్యమవుతున్నాయి. ప్రధాన కూడళ్లలో అమ్మకాలు చేస్తున్నారు. పెరుగుతున్న పోటీకి తగ్గట్టుగా వ్యాపారులు ప్రత్యేకతను చాటుతూ విక్రయిస్తున్నారు. సరుకు నాణ్యతను బట్టి, ఆయా సైజులను బట్టి ధరలు ఉన్నాయి. **మంకీ టో**పీలు, స్వెటర్లు రూ.400 నుంచి రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇంకా నాణ్యత కలిగిన దుస్తులు కావాలంటే రూ.2 వేల నుంచి రూ.4,500 వరకూ చెబుతున్నారు. గతంలో కంటే ధరలు రెట్టింపు అయ్యాయని వినియోగదారులు చెబుతున్నారు. అయినా కొనుగోలు చేయడం తప్పదని అంటున్నారు.

ఆత్మీయ సత్కారం



భానుమూర్తి యాదవ్‌ను సత్కరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

అనకాపల్లి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమితులైన స్థానిక గాంధీనగరానికి చెందిన బోయిన భానుమూర్తియాదవ్‌ను పట్టణ పరిధిలోని వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కాళ్ల సత్యనారాయణ, విన్నకోట రాము, పడాల కొండలరావు, సేనాపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

శివోహం..!

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ఘనంగా మూడో సోమవారం పూజలు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వర స్వామి ధ్వజ స్తంభం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

అనకాపల్లి: నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. పట్టణ, మండలం పరిధిలోని శివాలయాలు కార్తీక మాసం మూడో సోమవారం పూజలతో కళకళలాడాయి. తొలి వేకువ జాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. మధ్యాహ్నం వరకు పలు ఆలయాల్లో స్వామివారికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, వివిధ పండ్ల రసాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పట్టణంలో వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి, మెయిన్ రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి, గవరపాలెం కోటవీధి భోగలింగేశ్వరస్వామి, శారదానది ఒడ్డున, గాంధీనగరం ఉమారామలింగేశ్వరస్వామి, చిన్న రాజుపేట సాంబశివుని ఆలయం, అరటిపళ్ల మార్కెట్ వద్దనున్న సాధువుల ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక అర్చనలు జరిపారు.

మండలంలో అక్కిరెడ్డిపాలెం, శీరంశెట్టివానిపాలెం, గోపాలపురం, మామిడిపాలెం, బవులవాడ, సీతానగరం, కొత్తూరు, వల్లూరు గ్రామాల్లోని శివాలయాల్లో ఓం నమఃశివాయ నామ సంకీర్తనలో భక్తులు మునిగితేలారు. ఆలయాల ఆవరణలో ఉన్న ధ్వజ స్తంభాలు, జమ్మిచెట్టు, తులసి, వేప, మారేడు చెట్ల వద్ద మహిళలు అధిక సంఖ్యలో దీపారాధన చేశారు. బ్రాహ్మణులకు స్వయంపాక దానాలు నిర్వహించారు. బట్లపూడి పంచాయతీ సోహం ఆశ్రమంలో మహా మృత్యుంజయ హోమం భక్తులతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మధ్యాహ్న అన్నసమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా ఆలయాల వద్ద ఈవోలు, పట్టణ, మండల సీఐలు టి.వి.విజయకుమార్, అశోక్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు



సిద్ది లింగేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు



అరటిపళ్ల మార్కెట్ వద్ద సాధువుల ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు



నాయుడుపేట సోహం ఆశ్రమంలో శివలింగం

క్షతగాత్రులకు వైఎస్సార్‌సీపీ నేత మలసాల పరామర్శ



ఆస్పత్రిలో క్షతగాత్రుని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: స్థానిక గొల్లవీధి చొడేశ్వరి సాంబమూర్తి దేవాలయం వద్ద కార్తీక పౌర్ణమి రోజు శుక్రవారం స్వామివారి పల్లకి జ్వాలాతోరణం కింద తిరుగుతున్న సమయంలో జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు గాయపడి ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతున్నారు. వారిని సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. జ్వాలా తోరణం రోజు స్వామివారి పల్లకి ఊరేగింపులో ఇటువంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు జాజుల రమేష్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్యనాయుడు, పార్టీ నాయకులు బుద్ద నరసింహారాజు, పెంకటకోట శ్రీను, గైపూర్ రాజు, గాడి మాధురినాయుడు, ఏడువాకల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల హామీని నెరవేర్చాలి



సచివాలయం ఉద్యోగి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు వైఎన్ భద్రం

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చారని సీపీఐ జిల్లా నాయకుడు వై.ఎన్.భద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఉడ్‌పేట 6, 7, 8 సచివాలయాల వద్ద పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నేటికి సుమారుగా ఐదు మాసాలు అవుతున్నప్పటికీ సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేదన్నారు. అనంతరం 7వ సచివాలయం ఉద్యోగి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, కరణం మాణిక్యాలరావు, మొల్లేటి గోపాలరమణ, రావాడ వెంకటరమణ, మత్తుర్తి సూరిబాబు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



వ్యాస రచన పోటీల విజేతలతో అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి: గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ టౌన్ బాలికల హైస్కూల్‌లో సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం 'మహిళల భద్రత-విద్యార్థుల పాత్ర' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 35 మంది విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఉత్తమ వ్యాస రచనలుగా నిలిచిన ఆరుగురికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయం అధికారి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణ పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, హెచ్‌ఎం రుధిర రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..అధైర్యపడొద్దు

- నురవరంలో పార్టీ కార్యకర్తలకు మాజీ డిప్యూటీ సీఎం బూడి భరోసా



కార్యకర్తలకు భరోసా ఇస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు

మాడుగుల : గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని, అధైర్యపడవద్దని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. సురవరం గ్రామంలో సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామాల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న నీటి సంఘాల ఎన్నికలు కూడా బ్యాలెట్ పేపర్ అయితే అర్హులైన వారికి న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పార్టీలకు అతీతంగా సేవలందించడం ప్రజలకు తెలుసునన్నారు. నియోజకవర్గంలో గిరిజన గ్రామాలకు, రోడ్లు, వంతెనలు, భవనాలు దాదాపు పూర్తి చేయగలిగామన్నారు. తమ హయాంలో రోడ్లకు, వంతెనలకు మంజూరైన నిధులతో ఈ నాటికీ పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ఇంతకముందు వలే గ్రామాల్లో కార్యకర్తలకు ఎలాంటి కష్టమొచ్చినా ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు. తమకు అన్యాయం జరిగితే పోరాడుదామని, అనవసరమైన గొడవలకు దిగరాదని, కార్యకర్తలకు హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, షేక్ ఉన్నీషా, పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎడ్ల హేమంత్ కుమార్, కుక్కర శ్రీధర్, కాళింగ కల్యాణరాజు, గోకేడ అప్పలనాయుడు, కాళ్లరాజు, టి. రాంబాబు, తంటపురెడ్డి బన్ని, గోకేడ అప్పలనాయుడు, సోలం రమేష్ పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కేరళ ప్రిన్సిపల్ సెక్రటరీ



కప్పస్తంభం వద్ద డాక్టర్ అశోక్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శనివారం కేరళ వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ బి.అశోక్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ అందించారు.

కూచిపూడి నాట్యాన్ని మరింత ప్రోత్సహించాలి



చిన్నారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న దివాణం, నూకరాజు

నాతవరం : సంప్రదాయ కళలను నేటి తరం కాపాడుకోవాలసిన ఆవశ్యకత ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చమ్మచింత ఉప సర్పంచ్ అప్పన దివాణం మాజీ ఎంపీటీసీ సభ్యులు కాశపు నూకరాజు అన్నారు.మండలంలో చమ్మచింత గ్రామంలో శివాలయం వద్ద సోమవారం విజయవాడకు చెందిన చిన్నారులతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమం అనంతరం స్థానిక శ్రేయోభిలాషి నిర్వాహకులు నానాజీ ఆధ్వర్యంలో కూచిపూడి బృందాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించి షీల్డుతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల నాట్యం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. శివాలయ ప్రాంగణంలో భక్తిభావంతో కూడిన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండ కార్యదర్శి అప్పన విజయ్, శ్రేయోభిలాషి సంస్థ వ్యవస్థాపకుడు నానాజీ, శివాలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



పూజల్లో పాల్గొన్న అయ్యప్ప దీక్షధారులు

నాతవరం : మాధవనగరం గ్రామంలో సోమవారం రాత్రి అంగ రంగ వైభవంగా అయ్యప్పస్వాములు అంబలం పూజ నిర్వహించారు. అయ్యప్ప స్వామి దేవతామూర్తులు ఫొటోలతో గురుస్వాములతో ప్రత్యేకంగా ఆలయం నిర్మించి పూజలు నిర్వహించారు. స్వామి అయ్యప్ప 18 మెట్లు ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వామి భజనలతో పడి పూజ ముగించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు ఇతర భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా శూలాల మహోత్సవం ప్రారంభం



శూలాలు ధరించిన భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో సోమవారం పార్వతీ సాంబమూర్తుల శూలాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి పార్వతీ సాంబమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు నాలుక, బుగ్గలపై ఇనుప చువ్వలు గుచ్చుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శూలాలు ధరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు.

'గెస్ట్ లెక్చరర్' దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బోటనీ సబ్జెక్టును ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు ఎమ్మెస్సీలో సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, నెట్/సెట్ కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో డెమో క్లాసు ఇచ్చేందుకు బుధవారం(20వ తేదీ) ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరుకావాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప రథయాత్ర



విద్యుదలంకరణ నడుమ స్వామి వారి రథయాత్ర

నర్సీపట్నం : పట్టణంలో శ్రీస్వామి అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి రథయాత్రను కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్ప దీక్షధారులు భక్తి శ్రద్ధలతో స్వామి రథాన్ని లాగారు. మేళ తాళాలతో స్వామి వారి రథయాత్ర పట్టణ పురవీధుల మీదుగా సాగింది. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.